# వ్యర్థత్యాగం

చలపతిరావుగారు అనుకోకుండా కన్పించారు. అన్నాళ్ళకు-పదేండ్ల తర్వాత ఆనాడు కన్పించారు. వారిని చూచి నేను ఆశ్చర్యపడ్డాను.

మనిషిలో గుర్తుపట్టలేని మార్పురావడం ఎంత చిత్రంగా ఉంటుందో పది పదిహేను ఏండ్ల తర్వాతకూడా ఏచిన్న మార్పులేక పోవడముకూడా అంతే చిత్రమనిపిస్తుంది.

అదే విగ్రహం-అదేవేషం.

ఆ ఖద్దరు లాల్చీయే-అముతకధోవతే! ఆ మీసపుకట్టూ అల్లాగే ఉంది. ఆ నిండుతనం ఇంకా నిల్చే ఉన్నది. భుజానవేసుకొనే గుడ్డ సంచీ రంగు మారిందికాని మాదిరి అదే. ఆ వ్యక్తిలో ఎక్కడా ఒక చిన్న మెత్తుమార్పైనారా లేదు. అయితే మరీ పరీక్షగాచూస్తే-అదీ మొదటి నుండీ వారినెరిగినవారు మాత్రమే-వారికి వయస్సు పైబడిన విషయం తెలుసుకోగలరేమో.

నన్ను చూడంగానే చిరునవ్వు నవ్వుతూ పల్కరించారు "ఏంతమ్ముడూ క్షేమమా!" అని.

నేను వారివంక విదానంగాచూస్తూ- లోనకలిగిన ఆనందం, ఆశ్చర్యం లోలోనే అణచుకోవాలని యత్నిస్తూ. చిరునవ్వునవ్వుతూ "ఆ. ఆ." అని మాత్రమే అనగలిగాను.

అరోజు పట్నంనుండివస్తూ బెజవాడ స్టేషనులో బండి ఆగంగానే దిగివెళ్ళి కాఫీ సేవించి మళ్ళీ మళ్ళీ దిగవలసిన అవసరం కలుగకుండా

ఫ్లాస్కునిండా కాఫీపోయించుకొనివచ్చి, నా బెర్తుపై ఒక మూలగా పెట్టుకొని, క్రిందకు దిగి ప్లాటుఫారంమీద నిలబడి ఉన్నాను. అప్పుడే ఆయన కన్పించారు. వారూ మరొక పెట్టెలోనుండి దిగి వస్తున్నారు.

వారు కన్పించగానే ఒక్క క్షణం ఆశ్చర్యపడుతూ అల్లా నిలిచిపొయ్యాను. మరుక్షణంలో ముందుకువెళ్ళి నమస్కారం చేశాను. వారు నా క్షేమం పరామర్శించారు.

"ఎక్కణ్ణించండీ రావడం అన్నగారూ?" అని అడిగాను నేను.

"ఇంటిదగ్గరనుంచేనయ్యా"

"అయితే ఇటు ఎక్కడిదాకా."

"వాల్తేరు వెళదామని బయలుదేరాం"

"అహా అల్లాగా నేనూ అక్కడికేనండి" అన్నాను నేను.

అన్నగారు కూడా వస్తున్నందుకు నాకు చాలా ఆనందమయ్యింది. ఏ విధమైన కోపమూ లేకుండా ఆయన నాతో పూర్వంలా చనువుగా మాటాడినందుకు నాకు నిజంగా ఎంతో ఆశ్చర్యం కలిగింది.

"అయితే అన్నగారూ రండి-అభ్యంతరం చెప్పకండి ఇద్దరం కలిసి కూర్చుందాం మా పెట్టెలోనే. సరే మామూలేగా- సామానేమీ లేదుగా" అన్నాను.

వారు ఒక్క క్షణం ఆలోచనలో దిగబడ్డారు. నేను కాస్త ధైర్యం చేసి "రండన్నగారూ రండి." అని చెయ్యి పుచ్చుకొని ముందుకు నడువబోయాను.

"ఈసారి సామాను చాలా ఉంది - ఆడ వాళ్ళతో ప్రయాణంకదా" అన్నారాయన.

"అయితే ఇంకేం వదినగారూ వస్తున్నారాపదండి వాళ్ళనూ తీసుకొనివద్దాం." అని ముందుకు పోవడానికి ఉద్యుక్తుణ్ణి అయ్యాను. కాని వారు అక్కడే ఆగారు.

"అబ్బే ఎందుకు లేవయ్యా అవన్నీ కదపడం శ్రమ" అన్నా రాయన.

నాకు తెలుసును వారితో వచ్చే చిక్కు. వారు రెండవ తరగతి పెట్టెలో ఎక్కారు. సొమ్ము నేను ఇచ్చుకొంటానండీ అన్నా సరే ఆయన అంగీకరించరు. ఈ విషయంలో నేను క్రితంలో చాలాసార్లే ప్రయత్నం చేసి ఓడిపోయాను. అదొక నియమం ఆయనకు.

"సరే ఆ సంగతి తర్వాత చూద్దాం-ముందు పదండి వదినగార్ని చూస్తాను" అని ముందుకు నడిచాను.

ఆవిడను నేనసలు గుర్తుపట్టలేక పొయ్యాను. నాకు జ్ఞాపకం ఉన్న వ్యక్తికీ ఈ వ్యక్తికీ అసలు-ఏ కోశానా పోలిక లేదనిపించింది. ఎంత మనషి! రథంలాగా-లావుగా-ఎత్తుగా-ఎంతో ఠీవిగా-ఉండేది. మనిషి పచ్చని పసిమి. ముఖంలో ఎంత వర్చస్సు!- మాట ఎంత ముచ్చట! హృదయంలో ఎంత ప్రేమ! ఎంత చాకిరీ చేసేది! అర్ధరాత్రివేళ అనుకోకుండా హఠాత్తుగా పదిమంది వచ్చిపడ్డా-ఒక్క రవ్వకూడా విసుక్కోకుండా కూరానారాచేసి భోజనాలు పెట్టేది. ఎవరు వచ్చినా ఎంతో ఆదరించేది.

అల్లాంటిమనిషి ఎల్లా అయిపోయిందో! నేనెంతో ఆశ్చర్య పడి పొయ్యాను. అంతలో నా హృదయం జాలితో నిండిపోయింది.

అంతలో నాకు కోపంవచ్చింది. అవును నిజంగానే మా అన్నగారి మీదే కోపంవచ్చింది. ఆవిడ బాగా జబ్బు పడి ఉండాలి. ఊరికే చుట్టపుచూపులా వచ్చిపోయే దగ్గో పడిశమో చిన్న జ్వరమో- అల్లాంటిది కాదు. చాలకాలంగా తిష్ఠవేసుకొని కూర్చున్న జబ్బే అయిఉండాలి. దీనికంతటికీ నిస్సందేహంగా అన్నగారి అశ్రద్ధే అసలుకారణం అయి ఉండాలి.

ఆవిడ ఆ మెయిల్లో జన సమర్ధంగా ఉన్న మూడవతరగతి పెట్టెలో ఒదిగి, కిటికీకి ప్రక్కగా కూర్చుని ఉంది. నేను లోపలకువెళ

ఎదురుగా చోటుచేసుకొని కూర్చుంటూ "ఆదేమండీ వదినగారూ ఇల్లా అయిపోయారూ!" అన్నాను దిగులుగా.

"అబ్బే! ఏం లేదయ్యా - కొన్నాళ్ళ నుండి ఒంట్లో ఏమీ బాగా ఉండటంలేదు."

"కారణం?"

"అనారోగ్యమే" అన్నదావిడ నాకు మనస్థైర్యం చేకూర్చడానికేమో అన్నట్లుగా ఓ చిరునవ్వుతూ ఆ విషయం తేల్చేస్తూ.

ఆవిడను ఇంకా దూరం ప్రశ్నించినా ప్రయోజనం లేదని అనుకొని చివరకు "అయితే ఇంతకాలం నాకో ఉత్తరంముక్క వ్రాయించాలనే అనుకోలేదన్నమాట. అన్నగారు వ్రాయలేదంటే కారణాలుండవచ్చు. మీరు వ్రాయడానికికేమండీ?" అని ఎంతో బాధపడుతూ అడిగాను. ఆవిడ సమాధానం ఎల్లాగో చెప్పదని గ్రహించి కొంచెం చిరాకుపడుతూ క్రిందకు దిగివచ్చాను. వచ్చి అన్నగారి ప్రక్కనే నిలబడ్డాను. నాకు వారు కన్పించిన ఘడియనుండీ ఒక అనుమానం బాధిస్తూనే ఉన్నది. వారికి నాపై క్రితంలో కలిగిన భావం పోయిందా లేదా అని. కాని ఆ విషయమై ప్రశ్నించడం బాగుండదు. అందుకని ఆ ప్రసక్తి తీసుకొనిరాకుండా 'ఏమండీ పిల్లలుక్షేమంగా ఉన్నారా?" అని అడిగాను. "ఆ, ఆ. ఇంటివద్దే ఉంచి వచ్చాను" అన్నారాయన.

ఆయనకు సంతానం కొంత ఆలస్యంగా కలిగింది. నేను చూచినప్పుడు ఒక పిల్లవాడూ - ఒక ఆడపిల్లా. ఆ పిల్లకే పదేళ్లు దాటిఉండాలి. అన్నగారికి పిల్లలంటే ఎంతో ఆపేక్ష. ఎవరి పిల్లలైనాసరే ఎత్తుకొని ముద్దాడేవారు. ఆరోజుల్లో రైల్లో పోతూ ఎవరి పిల్లవాడో దేనికోసమో ఏడుస్తూ తల్లిని వేధిస్తుంటే వారు వెళ్ళి-వాణ్ణి తనదగ్గరకు తీసుకొని సముదాయించి తనవద్దే ఉంచుకొనే వారు-తనో వాళ్ళోదిగి వెళ్ళేవరకూ.

పిల్లలు ఏడుస్తుంటే ఓర్చలేరాయన. వారి హృదయం చాలా మెత్తనిది.

మనిషి కొంచెం మోటుగా రాటుతేలిన వ్యక్తిలా కన్పించినా ఆయన ఇతరులకు ఏ కష్టం వచ్చినా ఓర్చుకొనే వారు కాదు- తన కష్టనిష్టురాలు అధిక సహనంతో ఓర్చుకోగలిగేవారు.

కేవలం పూర్వాచార పరాయణుల కుటుంబంలో జన్మించినా ఆయనకా ఆచారాలు పట్టనేలేదు. పదిఎకరాల మాగాణీ-నీవు పట్టించు కొన్నా పట్టించుకోకపోయినా మీ కుటుంబాన్నే అంటి పెట్టుకొని ఉంటా మంటూ వచ్చిన నిక్షేపమైన భూమి - పెద్ద ఆస్తి అంతా ఈయన హయాంలో క్రమంగా హరించుకుపోయింది, వారి సొమ్ము మరోలాపోతే వారిమీద నాకు ఏ సానుభూతీ ఉండకపోయ్యేను.

అల్లా కాక మాకోసం -నాలాంటి వాళ్ళకోసం ఖర్చు అయి పోయింది ఆయన సొమ్ము.

ఔదార్యం మెచ్చుకోదగిన గుణ విశేషమేగాని దానికైనా హద్దూ పద్దూ ఉండాలి; కాస్త వెనకా ముందూ చూచుకోవాలి.

అబ్బే! అన్నగారి కీవిషయంలో అసలేమీ తెలియదనే చెప్పుకో వాలి. ఆయనతో నాకు పది సంవత్సరాల నుండీ స్నేహం.

మొదటిసారిగా మా యిద్దరికీ జైల్లో పరిచయమయ్యింది. అది నేను మొట్టమొదటి సారిగా ఉద్యమంలో దిగి జైలుకు వెళ్ళిన రోజులు.

ఉడుకు రక్తంతో హృదయం ఉప్పొంగి పోతున్నదినాలవి. మే మిద్దరమూ చెరో జిల్లానుండీ వచ్చి ఆ జైల్లో కలుసుకొన్నాము.

వారు అప్పట్లో నన్నెంతో ఆకర్షించారు.

జైల్లో భగవద్గీత చదివివినిపిస్తూ ఉండేవారు. మనదేశంలోగ్రామా లను గురించీ-ఖద్దరు పరిశ్రమను గురించీ చెబుతుంటే మేమంతా ఎంతో

జాగ్రత్తగా వినేవాళ్ళం. ఆయన స్వయంగా వార్ధాలో ఆరేళ్ళపాటు ఉండి రావడం చేతఆయా సిద్ధాంతాలనుగురించిచక్కగా చెప్పకలిగేవారు. మాకు అడపాతడపా కలుగుతుండే అనుమానాలను తీర్చేవారు. నేనుఇంటిపట్టున ఉండి తిని తిరిగినవాణ్ణి కావడంచేత నాకా జైలు వాతావరణం-అక్కడి భోజనం సరిపడలేదు. కొద్దిలోజులకే చాలా అధైర్యపడ్డాను. వయస్సు లోనాచిన్న వాణ్ణి-పైగా అనుభవమా అంతకన్నాలేదు.

వారే నన్నుదగ్గర కూర్చో బెట్టుకొని "తమ్ముడూ ఇంత మాత్రానికే దిగులుపడితే-నువ్వు ఉద్యమానికేం పనికివస్తావయ్యా-కాస్త నిబ్బరంగా ఉండాలి" అంటూ ధైర్యం చెప్పేవారు. ఒకరోజున వారి స్వవిషయమేదో చెబుతూ- "చూశావ్ తమ్ముడూ నేను వచ్చేటప్పుడు మా అమ్మకు చాలా జబ్బుగా ఉంది. నేను ఉండి మందూ మాకు ఇప్పిస్తే తప్ప మరోదారి లేదు. అయినా ఆవిడను అల్లా వదలేసి పిలుపురాంగానే వచ్చేశాను. నేనేమైనా అధైర్య పడుతున్నానూ? అదీకాక నీ విషయంలో అల్లాంటి ఇబ్బందేమీ లేదాయె! ఇహఎటొచ్చీ వాళ్ళిచ్చే ఆహారం విషయమేగా నీకు ఇబ్బందిగా ఉన్నదీ! అయితే ఒక్కటి చూడూ-కోపగించుకోకు. మనం తిండి కోసం కాదుగాఇక్కడకు వచ్చిందీ!" అన్నారాయన.

ఆ మాటకు నిజంగానే నాకు కోపం వచ్చింది. తనకేం అల్లాగే చెబుతారనిపించింది. అక్కడ ఇంటిదగ్గరైనా మహా తిన్నవాడైతేనేగా అనుకొన్నమాట వాస్తవమే. కాని తర్వాత తెలిసింది వారి మాటలోఉన్న నిజం. నిజం తెలిసిన తర్వాత వారంటే మంచి గురుభావం ఏర్పడింది. వారినిచూచి ఒకసారి మరీ ఆశ్చర్యపడ్డాను.

ఈయన ఇక్కడ జైల్లో ఉండగా అక్కడ ఇంటివద్ద తల్లికిజబ్బు ఎక్కువై కొంతకాలం చాలా బాధపడి చనిపోయింది. భర్తృవిహీనయైన ఆ తల్లికి అంత్యక్రియలు జరిపించే అవకాశమైనా వారికి లభ్యం కాలేదు. ఆ ఉత్తరం మా జైలు అధికారికి సకాలంలోనే

చేరినా వారికి మాత్రం కావాలని ఆలస్యంగా అందచేశారు. అందుకు మేమంతా బాధపడ్డాం. వారు మాత్రం తొణకలేదు. బెణకలేదు. ఆరోజు ఉపవాసం చేసి ఆ రాత్రల్లా జాగారంచేస్తూ గీతాపారాయణం చేశారు.

ఆ సంఘటనే నన్ను చకితుణ్ణిచేసి వారికి మరింత సన్నిహితంగా దగ్గరగా తీసుకొని పోయింది. వ్యక్తిగతమైన -లోక సహజమైన ప్రేమ-ఆపేక్షలనూ ఒక ఆదర్శసాధనకై వారు ఏనాడో బలిపెట్టేశారని గ్రహించాను. అటువంటి నిబ్బరం కల మనిషి దగ్గర ఉండి మంచి అనుభవం శిక్షణా సంపాదిద్దామని అనుకొన్నాను.

కాని నాకా అవకాశం లభించలేదు. ఇంటిదగ్గర మావాళ్లు కొన్ని ప్రయత్నాలు చేశారు. జరిమానాలు చెల్లించారు. పలుకుబడి అంతా ఉపయోగించారు. వీటి అన్నింటి ఫలితంగానన్నుఅక్కడనుంచిమరోజైలుకు మార్చి "బి"క్లాసులో వేశారు. అన్నగారిని అక్కడే "సి" క్లాసులో వదిలి వచ్చేశాను.

అదృష్టమనేది అన్నిచోట్లా ఉంటుంది. చివరకు ఆజైళ్ళల్లో కూడా ఉన్నది. నాకాజైలు మార్పు మంచికే వచ్చింది. పెద్దవాళ్ళతో పరిచయాలయినాయి.

కాని నాకు అక్కడా సరిపడలేదు. నా ఆరోగ్యం కొంత చెడింది. అతి ప్రయత్నం మీద ఆరునెలల తర్వాత చెర విడిపించుకొని బయటకు వచ్చాను. నేను వచ్చిన రెండేళ్ళకు అన్నగారూ, ఆయన మిత్రులూ బయటకు వచ్చారు. వారంతా జరిమానా కట్టక పోవడంచేత పూర్తి శిక్ష అనుభవించవలసి వచ్చింది. నేను విడిచివచ్చిన జైల్లో అన్నగారి మూలంగా కొన్ని ఇబ్బందులు కలిగాయట. వారు ఆ జైలు అధికారిని 'రూల్సు' ప్రకారంగా ధర్మంగా నడుచుకోమని కోరారట.

దాంతో ఆ అధికారికి ఆగ్రహం వచ్చి, వారిపై క్రోధం వహించి, మరో సమయంలో ఏదో చిన్న తగాదా పెట్టుకొని, తగాదా పెంచి వారిని లాఠీతో కొట్టి,ఇంగ్లీషులో తిట్టి,అవమానపరచి, పైకి ఆయన జైలు అధికారుల పట్ల విధేయత చూపడం లేదనీ, శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్నాడనీ అని వ్రాశాడట.

దాంతో వారిని అక్కడనుంచి రాయవెల్లూరు, రాయవెల్లూరునుంచి బళ్ళారి, బళ్ళారినుండి మా కెవరికీ పేర్లయినా తెలియని ఉత్తర ప్రాంతాల జైళ్ళకూ పంపారట.

వారు జైలునుంచి తిరిగి రాగానే వెళ్ళి చూచాను. ఆయా జైళ్ళల్లో వారిని చాలా బాధ పెట్టారట.

వెంటనున్నవాళ్ళు చెబుతూంటే నాకళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆ అధికారులు అన్నగారి బొమికలయితే విరగగొట్టలేదుకాని కండలను మాత్రం కరిగించి వేశారు. అల్లా అయి వచ్చిన వ్యక్తిని చూచేసరికి మగవాణ్ణి నేనే నిలువునా నీరైతే మా వదినగారు భోరున ఏడ్చిందంటే విచిత్రం ఏమీలేదు.

బిక్కమొగాలు వేసుకొని కూర్చున్న మమ్మల్ని-గుండె బాదుకొంటున్న భార్యనూచూచి ఆయననవ్వుతూ "ఊర్కోండర్రా-అంత పిరికివాళ్లయ్యారేమర్రా - నాకోసం అంతదిగులా - నాకేం - నిక్షేపంలా ఉంటే" అంటూ ఏదో చెప్పుకుపోయారు. వారి మాటలు నాకే మాత్రం ధైర్యాన్ని ఇవ్వక పోయేసరికి చివరకు ఆయన ఇల్లా అన్నారు.

"ఓయ్ తమ్ముడూ-నేను ఆరు నెలల్లో పూర్వంలా కాకపోతే ఉద్యమనుండి విరమిస్తానయ్యా సరేనా?"

నేనప్పుడు వదినగారిని అతికష్టంమీద ధైర్యం చెప్పి ఊరుకోబెట్టాను.

9227



చూచి పోదామని వచ్చిన నేను వారింట్లో చాలా కాలం ఉండిపోయాను. ఆశ్చర్యం! అన్నట్లుగానే ఆయన సరిగ్గా ఆరు నెలల్లోనే ఆరోగ్యవంతులయ్యారు.

అది నాకు చాలా చిత్రమనిపించింది.

వచ్చినప్పటినుంచీ ఒక్కరోజైనా వారు విశ్రాంతి తీసుకొన్నది లేదు. మూత పడిన హిందీ పాఠశాల తిరిగి ప్రారంభించారు. జిలా అంతా తిరిగి ఖాదీ ప్రచారం కొనసాగించారు. మమ్మల్నందరినీ వెంట పెట్టుకొని గ్రామాలకు పోయి మాలగూడాలు పరిశుభ్రం చేయడం, రాత్రిళ్ళు గ్రామస్థులను సమావేశ పరచి వాళ్ళకుఆయా విషయాలు విశద పరచడం-ఇల్లాగా ఎన్నో పనులు మళ్ళీ మొదలు పెట్టారు. ఊళ్ళో పురపాలక సంఘం వ్యవహారాల్లో కలుగజేసుకొని ప్రజోపయోగ కర మైన పథకాలు అమలు జరపడానికి ఏర్పాట్లు చేశారు. వారికోక్షణం తీరికే లేదు!

అందువల్లనేనొకసారి వారితో "ఏమండీ అన్నగారూ - మీకీ ఆరోగ్యం ఎల్లా వచ్చిందండీ కాస్తయినా విశ్రాంతి లేకుండా ఇల్లా తిరుతున్నారే! ఏమిటీ చిత్రం-ఎక్కడ ఉందీ రహస్యం" అని అడిగాను.

"అల్లా అడిగావు బావుంది- చూశావూ-అక్కడ వాళ్ళు మన స్వేచ్ఛను అరికట్టారు. బయటకు రాగానే స్వేచ్ఛ లభించింది. స్వేచ్ఛ వలన పుష్కలంగా ఆరోగ్యం లభించింది. నాలాగే నాతల్లి కూడా సంపూర్ణమైనస్వాతంత్ర్యంపొందగానేమంచిఆరోగ్యవంతురాలవుతుంది." అన్నారు.వారి మాటలు నా హృదయానికి హత్తు కొన్నాయి. అంతకు ముందు దేశానికి స్వేచ్ఛ కావాలి-వచ్చితీరాలి అన్నమాటలు ఎన్నో సార్లు విన్నాను, ఇప్పుడు ఎందుకు రావాలో వారి ద్వారా విన్నాను. నన్నంతగా ఆకర్షించిన అన్నగారింట్లోనే ఉండి అనేక విషయాలు నేర్చుకొన్నాను.హిందీనేర్చాను. అప్పట్లోనేనేకాదునాలాగే చాలామందివారిఇంట

కథా నిలయం
5387
శ్రీకాకుళం



ఉండిపోయారు. అల్లాగా వారింటిలోనే ఉండివారిచేత "తమ్ముడూ అని పిలిపించుకొంటూ, వారి ప్రేమ వృక్షపు నీడలో పెరిగి పెద్దయై ఆయనకు ఆత్మీయుణ్ణి అయ్యాను.

ఆతరువాత జరిగిన వ్యక్తి సత్యాగ్రహంలో మేమంతాజైళ్ళకుపోయి వచ్చాము. అదంతా సాదాగా శాస్త్రరీత్యా జరిగింది. అయితే ఒక చిన్న తేడా ఉంది వారికీ నాకూ. వారు సత్యాగ్రహం ఆగ్రామం లోనే చేస్తే నేను మరికొందరు మిత్రులతోపాటు బస్తీకిపోయి నలుగురి సమక్షంలోనూ కొంత అట్టహాసంగా "అరెస్టు"యి వెళ్ళాను.

నేను పదినెలల తర్వాత తిరిగి వచ్చాను.

తిరిగి వచ్చిన కొద్ది కాలానికి ఆగస్టు పోరాటం ప్రారంభం అయ్యింది.

నేను వయస్సులో చిన్నవాణ్ణి కావడం చేత వారి అనుమతి లేకుం డానే మరీ ముందుకు వెళ్ళాను. నాకంటె చిన్నవాళ్ళతో చేతులు కలి పాను. కొన్నిపనులు జరిగాయి. వాటికి నేనే బాధ్యుణ్ణి. అది పైవారికి తేలికగా తెలిసింది. అన్వేషణ సాగించారు. నేను తప్పించుకొని తిరి గాను. నాకూ అన్నగారికీ ఉన్న సంబంధం అందరికీ తెలిసినదే. అది ప్రభుత్వానికి తెలియడం ఏమంత కష్టమైన విషయం కాదు. వారు జైలునుండి తిరిగి వచ్చిన కొద్దిరోజులకే క్రొత్త చిక్కుల్లోపడ్డారు.నేనొక అర్ధరాత్రివేళ వెళ్ళి వారిని చూచి వచ్చాను. మరొక రాత్రి అధికారులు వచ్చి వారిని కారులో ఎక్కించుకొని తాలూకా దాటించి ఠాణాకు తీసుకొని పోయారు. ఠాణాలో వారు నా ఆచూకీ చెప్పమని అన్నగారిని మర్యాదగా కోరారు, వారు చెప్పలేదు. ఎన్ని విధాల భయపెట్టి అడిగినా వారు చెప్పనే లేదు. అప్పుడున్న సర్కిలు ఇనస్పెక్టరుచాలా కరుకు మనిషి.

అన్న గారిదగ్గరనుండే ఆ సమాచారం రాబట్టాలని అతను విశ్వ ప్రయత్నం చేశాడు. తిట్టాడు, భయపెట్టాడు. చివరకు చేతకాక చెయి చేసుకొన్నాడు—ఎన్నిచేసినా లాభం లేకపోయింది. అటునించిఅటే వారిని జైలుకు పంపారు. ఎక్కడకు ఎటు తీసికొని పోయారో నాకేకాదు మా జిల్లాలవారి కెవరికీ తెలియలేదు.

ఆ ఉద్యమానికి "ఆగస్టుఅల్లరులు" అని నామకరణం చేశారు 'ఏ లెడివారు.' అందుకు సంబంధించిన పత్రాలు కొన్ని వారికి వప్పగించి నేను తప్పించుకొని తిరిగాను. ఆ కాగితాలూ అవీ వారు నాయందున్న ప్రేమ వలన పరులకందకుండా దాచారు. వారు నా ఆచూకీ చెప్పేస్తే వారికా బాధతప్పేది. కాని నాయందున్న ప్రేమ—ఆ పేక్షవలన చెప్పలేదు. నిజమే బయటపెడితే నాకు 'సి' క్లాసు కాదు మరేదో శిక్షవేశేవారు. కాని అల్లా జరుగలేదు. ఆ తరువాత కొన్ని నెలలకు నన్నూ పట్టుకొని పోయినా పెద్దమనిషిని తీసికొనివెళ్ళినట్లు తీసికొని వెళ్ళారు.

మాఉద్యమాలఫలితంగా నే అనండి, ప్రపంచపరిస్థితుల్లో కలిగిన మార్పులఫలితంగా అనండి—మొత్తంమీద పరాయి ప్రభుత్వంవారు దేశాన్ని విడచిపోక తప్పిందికాదు.

ఎన్నికలు వచ్చాయి. మాప్రాంతంనుండి అన్నగారు ఎన్నికయి వెళతారని నేను నిజంగా ఆశించాను. కాని మా కమిటీవారు ఏ కారణం వల్లనో వారి పేరుకాక మరోపేరు సూచించారు. నేను పరుగునవెళ్ళి అన్న గారితో ఆవిషయంచెప్పి 'రండి ప్రయ్నతం చేద్దాం' అన్నాను. వారు ససేమిరా రానన్నారు.

వారు అలాఅన్నాక, నేను వెళ్ళి నాప్రయత్నాలు నేనుచేసుకొన్నాను. పోటీలుపడి నా పలుకుబడి ఉపయోగించుకొని నా పేరు జాబితా లో వేయించాను. ఆ పని అయిన తర్వాత అన్నగారి దగ్గరకు వచ్చి వారి సంపూర్ణ సహకారం అభ్యర్థించాను. వారుఅంగీకరించి, సహకరించారు.

వారు నాతరపున చేసిన ప్రయత్నం అమోఘమైంది, ఇంటింటికీ వెళ్ళి చెప్పివచ్చారు. మొత్తం ఆ ప్రాంతం అంతా మా వైపు మొగ్గేలా చేశారు. మా సంస్థనూ దాని తరఫున నన్ను గెలిపించారు. అల్లాగా నేను అధికారంలోకి వెళ్ళాను.

అల్లాగా నేనూ మరికొందరం మిత్రులమూ అధికారంలోకి వెళ్ళాము. కాని అన్నగారు మాత్రం అక్కడే-వెనకే ఉండిపోయారు.

ఆయన అప్పుడే కాదు ఆ తర్వాతకూడా ఏ పదవిలోకీ రాకుండా ఉండిపోయారు. జిల్లాసంఘం, రాష్ట్రసంఘం అధ్యక్ష పదవులకు ఎన్నికల వంటివి ఎన్నో వచ్చాయి. వాటిల్లో దేనికో దానికి వారిని నిలబెట్టి గెలిపించాలని నేను తాపత్రయ పడ్డాను. ఆయన దేనికీ ఒప్పుకోలేదు.

వారు తిరిగి నిర్మాణ కార్యక్రమంలో మునిగిపోయారు. హిందీ ప్రచారం- ఖాదీ పరిశ్రమ-గ్రామ పునరుద్ధరణ-వయోజన విద్య ఇల్లా ఎన్నో పనులాయనకు.

సర్వమూ అయిపోయేదాకా త్యాగంచేయ్యడం మానుకోలేదు. ఉన్న ఆస్తీ, అమూల్యమైన కాలం, చివరదాకా త్యాగం చేస్తూనే ఉన్నారాయన.

ఇకదానికి అవధి ఏమిటో-దాని ఆశయ మేమిటో అల్పజ్ఞుడనైన ననాకు అంతు పట్టలేదు. అంతా పోయింది, ఇక ఎల్లా గడుస్తుందా వారికి అనినేను విచారపడ్డాను. కాని వారికా ఆలోచనేరాలేదు.

నేను మంచి పదవిలో ఉన్నాను కదా అన్నగారు వచ్చి నన్ను అభినందిస్తారనీ- ఏవైనా పనులు చేసి పెట్టమని అడుగుతారనీ సహజంగా నేఆశించాను. అల్లాగయినా వారి రుణం తీర్చుకొందామని ఆత్యాశకు పోయిన మాటా వాస్తవమే,

కాని వారునన్ను అల్లా వచ్చి చూడనేలేదు. పోనీ ఏపనులమీదా మనుష్యులను పంపనూ లేదు. ఆ తర్వాత నేను వారిని చూడటం పడలేదు.

నే నే స్వయంగా వెళ్ళడానికి కొన్ని విషయాలు అడ్డువచ్చాయి.

నామీద కొన్ని అపవాదులు వచ్చాయి. నే నేదో సంపాదిస్తున్నా నని అన్నగారిదాకా వెళ్ళింది. వారు నమ్మరనుకొన్నాను, కాని వారు ఎవరో చెప్పినమాటలు నమ్మి— నమ్మడమేకాక ఆరాలు తీయించి... చివరకు నాయందు అత్యత వైముఖ్యం చూపారు. తమ నిరసన బహిరం గంగా తెలియచేశారు.

ఆత్మీయులమైన తర్వాత నిజానిజాలా కావలసింది?

కాని, వారల్లా అనుకోలేదు. తనకు ధర్మ మని తోచింది అనేశారు. అయినా నేను అమాట వినికూడా పట్టించుకోలేదు. పెద్ద వారులే ఏదో అన్నారని సరిపెట్టుకొని ఊరుకొన్నాను.

పరాయివాళ్ళకు యుద్ధసమయంలో చదువు సంధ్యలేమీ అట్టే రాక పోయినాదుబాసీగాపనిచేసి, సైన్యంలో మందినిచేర్పించి, ప్రభుత్వానికితోడ్ప డిన మా కృష్ణయ్య ఈనాడు రావుబహద్దర్ శ్రీ వెంకటకృష్ణయ్య అయి, లక్ష రూపాయలకు అధికారియై, ఇప్పుడు స్వదేశీ మంత్రులనూ, అల్లాంటి వారినీ తనకార్లలో వేసుకొని త్రిప్పుతున్నాడు. మేమంతా...ఉడుతాభక్తి చూపిన- మేమంతా మా సేవకూ త్యాగానికీ అనేకరెట్లు అధికంగా ప్రతి ఫలం అందుకొన్నాం. అందుకు నన్నుకానీ మరొకర్ని కానీ ఆడిపోసుకో వలసిన పనేమీలేధు. ఆటువంటి అవకాశం వస్తే అదృష్టం కలిసివస్తే ఎవరూ కాదనరు. అని ఏమీ ప్రయోజనం లేదు.

కాని అన్నగారు మాత్రం తన ఆస్తీ, అన్నిటికంటే ముఖ్యమైన ఆరోగ్యం, అందరూకోరే సర్వసామాన్యమైన జీవితసౌఖ్యాలూ, విశ్రాంతీ, అన్నీ త్యజించి అందుకు ఫలితంగా...చివరకు రాగి పాత్రను పాణిత లాన్న అలంకరించుకొన్నారు. ఎంత నిస్వార్థం!

ఆ విషయం తలచుకొన్నప్పుడల్లా నా మనస్సులో నల్లనిమబ్బులు కమ్ముకొంటాయి. నాబాధ ఎవరికీ తెలియదు. ఈ విషయంలో నా తప్పు

లేదని చెప్పినా ఒప్పుకోరు. తప్పుకోడానికి ఏదో అన్నావంటారు. ఎవరి దాకానో ఎందుకు ఆ మధ్య ఒకసారి మా అమ్మే అన్నది.

"ఒరేయి అబ్బాయి– మన చలపతిరావుగారు చాలా ఇబ్బంది పడుతున్నారటరా. నువ్వు కాస్త వెళ్ళి ఆదుకోరాదటరా? అబ్బే నువ్వు ఆయన కెందుకు చేస్తావ్ సాయం! నీ కొడుక్కి– చేసుకుంటావ్, కాక క్రొత్త అల్లుడికి చేసుకోంటావ్!" అని నిష్ఠురాలాడింది.

నిజం ఎవరికి తెలుస్తుందీ! నాబాధ ఎల్లా చెప్పుకోగలను!

వారిస్థితి అంతా తెలుసుకొని వారికి తోడ్పడాలనే వారికోబట్టల లైసెన్సు తన కాళ్ళవద్దకు పంపాను. అది వారు మరొకరికి ఇచ్చుకొన్నా కొంతవచ్చును, కాని ఆయన నిరాకరించారు, వెంటనే నిరాకరించారు.

విసిరి నామొహాని కొట్టారని అనిపించింది. బాధ పడ్డాను– కాని సహించాను.

అదేకాక ఆవిధంగా వారికి ఎన్నివిధాల అవకాశాలు కలుగజేసినా వారు అందుకోలేదు. పైగా నామీద కోపం వచ్చింది. ఆ కోపం నాటికా నాడు పెచ్చు పెరిగింది. ఆ విషయం తెలిసే వారిని చూడటానికి నేను స్వయంగా వెళ్ళ లేకపోయాను.

అన్నగారి సొమ్ముతిని– వారివల్ల పైకి వచ్చి వారిని ఆదరించ లేదని–కృతజ్ఞత లేని వాడననీ నన్ను కొందరు ఆడిపోసుకొన్నారు. వారి మాటలు అన్యాయ మనిపించింది.

లోపాలు ఉండవచ్చు. మనిషి అన్నాక ఏదో ఒక లోపం–ఒకా నొక స్థితిలో కన్పింపవచ్చు. అంతమాత్రం చేత గతాన్ని అంతా విస రించి అన్నగారల్లా ప్రవర్తించడం నాకేమాత్రం సహజంగా కన్పించ లేదు.

రాజకీయ బాధితులకు కాస్త పొలం పుత్రా

ఇచ్చే ఏర్పాటు చేసింది ప్రభుత్వం. మేమూ తలా కాస్త పుచ్చుకొన్నాం. ఎక్కడెక్కడవాళ్ళో వచ్చి మా సహాయం అందుకొని మమ్ములను ఎంతో అభినందించి వెళ్ళారు. కాని అన్నగారు దరఖాస్తు అయినా పెట్ట లేదు. దరఖాస్తు వస్తుందేమో సాయం చేద్దామని అనుకొన్నాను. కాని అల్లా రాలేదు.

అన్నగారికి నేను స్వాభిమానం చంపుకొని ఒక మనిషిచేత కబురంపాను.

వెళ్ళిన మనిషి అవమానితుడై తిరిగి వచ్చాడు.

"నాకు భరణం ఇస్తారటయ్యా-వాళ్ళేమో అసలు సిద్ధాంతాలుమర్చి పోతారూ-మా వద్దకేరారూ!" అని ఏమో అన్నారట.

అంతే దాంతో మా యిద్దరికీ చెడింది. మనసు విరిగాక మరల కలవడం కష్టం. వారి విషయంలో అంతే జరిగింది; రెండవసారి ఎన్ని కలు వచ్చాయి. నాకేదో భయమైంది. చివరకు నాభయం నిజమైంది.

కారణాలు ఏవైతేనేం నేను ఓడి పోయాను. వారు మరో అభ్య ర్థికి సాయం చేశారు. వారికి ఇంకా అంత ఓపిక మిగిలి ఉందని గానీ-పలుకుబడి ఇంకా నిలిచి ఉందనిగానీ నే నూహించుకోకపోవడం కూడా ఒక కారణమే కావచ్చు.

వారికి నామీద విరోధభావమే ఏర్పడింది. అయితే నేనేమీ పగ సాధించలేదు. మరొక జిల్లాకుపోయి అక్కడ నుంచి ఉప ఎన్నికలలో కేంద్రానికి పోటీచేసి ఆ స్థానం గెలుచుకొన్నాను. అల్లాగా నేను అభి వృద్ధిలోకి వచ్చాను. కొంత పలుకుబడి సంపా దించుకొన్నాను. నా యోగ్యతలనూ-నాపూర్వజన్మకృత పుణ్యాన్నీ, నాఅధి కారాన్నీ అన్నీ చూచి లక్ష్మీదేవి నన్ను వరించింది. అందుకు ఎవరో ఈర్ష్య వహించారనిగానీ-ఏదో అనుకుంటున్నారని గానీ విన్నా నేను

లక్ష్య పెట్టనేలేదు. ఈ గడిచిన పదేళ్ళలో అన్నగారు-అదే మా చలపతి రావుగారు నాకు కన్పించలేదు. ఆ అవసరం నాకేమో కలుగలేదుకదా వారికైనా కలుగుతుందేమో అనుకొన్నాను. కాని అల్లాంటిదేమీ జరగలేదు.

ఇన్నాళ్ళకు కన్పించారు.

కలకాలం పాతవిషయాలు జ్ఞాపకం ఉంచుకొని పగపట్టి బుసకొట్టే విషసర్పపు బుద్ధికాదు గనుక నేనే ముందుకువెళ్ళి అన్నగారిని పల్కరించాను. నమస్కరించాను. ఆయన కన్పింపకపోయినా నేను వారియందు వైముఖ్యాన్ని ఏనాడూ వహించలేదు. మారైతులు ఏదో పనులమీదవచ్చి. మాటలు సందర్భంలో అన్నగారినిగూర్చి ఏమో చెబుతుండేవారు "ఆయన నిజంగా ఎనుమంటి మడిసండీ మునిసిపాల్టీకి నాయుడుగోరి పేర్టీకి ఎగస్టు పేర్టీగా నిలుసుండారు. ఆయనే వచ్చి పదియేలిత్తామానుకోమంటే నసేమిరా ఇనుకోలా. ఆయనకు ఏలుచేదయినాయి తింటానికి లేక పోయినా."

అల్లావారు చెప్పినప్పుడల్లా నేను వినిహర్షించాను. నేనూ ప్రశంసించాను. వారిని సమర్థించి వారి మనస్తత్త్వం విడబరచి చెప్పి వారి త్యాగశీలత నుగ్గడించాను.

వారు పడుతున్న ఇబ్బందులూ విన్నాను. ఒకసారి బొంబాయినుండి ఒక చిన్నావాడు వారింటికివచ్చి వారిని గౌరవించి-అన్నగారి స్థితి-పూర్వాపరాలు రెండూ తెలిసికొని చాలా విచారపడి వారికి రెండు జతల పంచలుపెట్టి పాదాభివందనం చేసి వెళ్ళాడట! అదీ విన్నాను.

ఇంతకంటే అన్యాయం ఏమన్నా వుందా! బాగాఉన్న రోజుల్లో ఆయన ఎంతమందికి వస్త్రదానం చేశారూ-అసలు వారి నడగవలసిన అవసరం లేకుండానే ఎందరు వారింట్లోంచి వెళ్ళేటప్పుడు నూత్న వస్త్రాలు

వాంట్లోవి తీసి కట్టుకొని నవ్వుతూ సంతోషంగా వెళ్ళారో!_వారికీ_ స్థితి వచ్చింది. ఇంత తెలుగుదేశం ఉంటే_ఇంతమంది అయినవాళ్ళుం ఉంటే ఎవరో పరాయి వ్యక్తివచ్చి ఔదార్యం చూపి పోవలసి వచ్చింది. ఈ విషయం విన్నాక నాకళ్లలో నీళ్ళు తిరిగాయి అంటే ఎవరు నమ్మ తారు? తప్పుకొంత నాదే కావచ్చు. నిజమే. కాని మిగతావాళ్ళంతా ఏమ య్యారు? కారాణాలు ఎవో ఉన్నాయి కనుక నేను సహాయం చేసినా ఆయన పుచ్చుకోలేదు. అందువల్ల నా విషయం వదిలెయ్యండి కాని మిగతా దేశం అంతా ఏమైంది?

ఇది నాకే అంతు పట్టినిది మరొకరికి అంతుపడుతుందనిగాని వారిని ఆదుకొంటారనిగానీ నేను అనుకోను — నేనల్లా ఆశించినా జరగనూ జర గదు.

ప్రభుత్వం తనకుతానై ఏమో చేస్తుందని ఆయనా ఏనాడూ భావించనూ లేదు_తనకిది కావాలని అభ్యర్థించనూలేదు. వారిని జైళ్ళల్లో హింసించిన వార్డర్లు కొందరు ఉన్నత పదవులలోకి పోయారు. కొందరు పింఛను పుచ్చుకొని సుఖంగా కూర్చున్నారు. మా ఊళ్ళో ఆగస్టు దినాల్లో అన్నగారిని ఠాణాలో అన్యాయంగా కొట్టి వీపుమీద శాశ్వతమైన గుర్తులు పెట్టిన అధికారి ఇప్పుడు పెద్ద అధికారికూడా కాబోతున్నాడు.

*　　　*　　　*

ఆయన ఇన్నాళ్ళకు అల్లాగా ఈ తప్త హృదయునకు కన్పించ గానే మనసు ఆనందమగ్నమూ_హర్షపులకితమూ అయింది.

ఆయన నన్ను పూర్వంలాగా ప్రేమతో "తమ్ముడూ" అంటూ పల్కరించగానే నాహృదయంలో ఎక్కడో దాగిఉన్న ఆకాస్త కోపమూ పోయింది. నిజంగా సంతోషించాను. వదినగారిని చూచాక నాకు పట్టరా నంత దుఃఖం పొంగివచ్చింది. ఈసారి ఏమైనా సరే వారికి ఏదో సాయం

చేయాలని గట్టిగా సంకల్పించుకొన్నాను. అందువల్లనే ఆయన రానంటే నేనేవెళ్ళి వాళ్ళు కూర్చున్న మూడవ తరగతి పెట్టలో కూర్చున్నాను.

ఇద్దరం హృదయాలు విప్పి మాటాడు కొన్నాం. దారిలో వారు చాలా విషయాలు చెప్పారు. చాలా ప్రశాంతంగా నెమ్మదిగా మాటాడారు. ఎక్కడా ఆవేశంగానీ ఆక్రోశంగానీ లేదు. మహానుభావుడూ యుగపురుషుడూ-ధర్మపరుడూ అయిన ఒక నాయకుని అడుగుజాడల్లో నడచి స్వాతంత్ర్య సమరాన్ని నడిపినవారే అధికారంలోకి వచ్చే సరికి ఎల్లా ధర్మ విరుద్ధంగా ప్రవర్తిస్తున్నదీ వివరించి చెప్పారు.

అందుకు పరిష్కార మార్గాలు సూచించారు. నేను నా పశ్చాత్తాపాన్ని తెలిపి, క్షమాభిక్ష వేడుకొని, అన్నగారు చెప్పిన మాటలే మరల మరల మననం చేసుకొని ఆ పవిత్ర భావాలతో నా హృదయం క్షాళనం చేసుకొన్నాను.

మెయిలు సాయంకాలానికి గమ్యం చేరింది. విశాఖ పట్టణంలో నాకేర్పాటయిన బసకు పోదామన్నాను. వారు "కాదు మేం-టర్నరు సత్రానికి పోతాం" అన్నారు. విధిలేక నేనూ వారిని అనుసరించాను.

వారు లోపల గదిలో సామాను సద్దుకొంటూ ఉంటే నేను సత్రానికి వెనుకవైపు ఉన్న చిన్నతోటలో పచార్లు చేస్తూ కాలం గడిపాను కొంత సేపు.

చీకటి కోణాల్లో బడలికతో ఒడలు తెలియక పడియున్న మానవ కోటిని తన మృదు హస్తాలతో తట్టి నిద్రలేపి, పనులు పురమాయించి, కర్తవ్యం ప్రబోధించి వెలుగు బాట చూపి, బద్ధకస్తులనుచూచి మధ్యలో కొంత కోపగించి తీక్షణదృక్కులతో అదలించి చివరకు ప్రసన్నుడై పశ్చిమదిక్కు చేరాడు గగన గామియైన సూర్యభగవానుడు. లేశమైనా కృతజ్ఞత చూపక-నమస్కారమైనా చేయని అనార్యులను చూచి అతడు

అవమానితుడై-జీవురించినవాడై-ఎఱ్ఱనై-విశాలమై-పెద్దనెత్తుటి మరకలా పశ్చిమాన కొండల వెనుకగా బాధతో కృంగి అంతర్ధానమయ్యాడు.

అదృశ్యం చూస్తూ కొంత సేపు గడిపే సరికి నా హృదయం-భయంతో, బా ధ తో కంపించింది. నిస్వార్థుడైన ఆ త్యా గ జీ వి, ఆ లోక బాంధవుని గురించే చాలా సేపు ఆలోచించాను. అంతలో అన్న గారు జ్ఞాపకం వచ్చి లోపలకు వెళ్ళి వదినగారి జబ్బు విషయమై చెప్ప మని మరీ మరీ అడిగాను. 'చెప్పడానికే ముంది-'అంటూనే వారు నాకు వివరంగా చెప్పారు.

ఆవిడ జబ్బు కడుపునొప్పితో ప్రారంభమైంది. మొదట గుర్తించ లేదు. తరువాత-ఖర్చు త క్కు వ క దా అని కా బో లు నాటు వైద్యాలు చేయించారు. అవేవీ లాభం లేదని తెలిసిన తర్వాత ఆవిడను తీసుకొని అన్నగారు మద్రాసు వెళ్ళారు. అక్కడ వారిని ఆదరించిన పాపాన పోయిందెవరూ? ధనమో పలుకుబడో లేకపోతే పట్టణాలలో పనులు ఎలా అవుతాయి? వారు ఏదోచూచి "ఏం లేదు పొమ్మ"న్నారు. మద్రాసునుండి తిరిగి వచ్చిన కొన్నాళ్ళకు తెలిసిన డాక్టరు ఒకాయన స్వయంగా శ్రద్ధతీసుకొని ఉచితంగా "ఎక్సురే" ఫొటో తీస్తే అసలు సంగతి బయటపడింది. "అల్సరు ఉంది. బాగాముదిరింది. వీలైతే విశాఖపట్నం వెళ్ళండి" అన్నారటఆయన.

ఆ మాటమీద వారు ఇంతదూరం వచ్చారు, వారా విషయం చెప్పాక "అల్లాగా అంత ముదిరేదాకా ఏం చేస్తున్నారండీ" అని అడిగి కూడా సమాధానం కాంక్షించలేదు కనుక మళ్ళీ "సరే లెండీ" అని నేనే అన్నాను.

అల్లా అని దొడ్లోకి వెళ్ళి ముఖం కడుగుకొని ముస్తాబై బయలు దేరాను ఆసుపత్రిలో చూడవలసి నవైద్యుల్ని ఇళ్ళవద్దే కలుసుకొనికాస్త పరిచయాలు చేసుకొని వద్దామని. నేను తీరా బయలు

దేరే సమయానికి అన్నగారు నా అభిప్రాయం ఎల్లా పసిగట్టారో ఏమో ఆ విషయం ప్రస్తావిస్తూ "తమ్ముడూ నువ్వు ప్రయత్నం ఏమీ చెయ్యకు. మీ వదినగారు అందుకు ఒప్పుకోదు. మేం ఇంతకు పూర్వమే ఒక నిర్ణయానికి వచ్చాం...ఆ రెండూ లేనివాళ్ళు ఏం చేస్తున్నారో ఎల్లా తంటాలు పడుతున్నారో మేమూ అల్లాగే అవస్థ పడతాం. అటువంటివాళ్ళు లక్షోప లక్షలు. వాళ్ళకు మించిన సదుపాయాలు నాకుఇష్టంలేదు. నా యందు నీకు ప్రేమ ఇంకా ఏమైనా ఉంటే నీవీ ప్రయత్నం మానెయ్" అన్నారు. వారు ఇంకా ఇల్లా అన్నారు.

"మనకు నిజంగా ఎంత అవసరమైనా–అధర్మాన్ని ప్రోత్సహించ కూడదు. నేనా విషయాలు వార్ధాలో 'వారు' స్వయంగా చెప్పగా నేర్చుకున్నాను .. అది అల్లా ఉంచు...అసలు ఇక్కడకు మేం వచ్చింది పెద్ద ఆసుపత్రి వైద్యానికి కాదు. ఆశ్రమంలో ప్రకృతి వైద్యం చేయించుకోడానికి."

అక్కడ ఉన్న ఆశ్రమానికీ వీరికీ ఉన్న పరిచయం తెలుసునాకు. వారికి వైద్యసహాయం ఉచితంగా లభిస్తుంది. అందుకనే వారుదాన్ని ఎంచుకొన్నారు వారా విషయం తేల్చి చెప్పేసరికి నాకు బాధ కలిగింది. సాయ పడవచ్చు కదా అన్న ఆశ భగ్నమై పోయింది. అన్నగారితో వాదించి వారిని మార్చటం అసంభవం అని నా కేనాడో తెలుసు. ఆయన చెయ్య బోయే పిచ్చి పనికి కోపం–జాలీ కలిగాయి. నా సాయం నిరాకరించారని కోపం –అయ్యో ఇదే మా అన్న జాలీకలిగి నాలో – నా హృదయంలో– ఎదురు బదురుగా ప్రవహించి వచ్చి, ఒక తావున రెండు ప్రవాహాలు ఢీ కొని ఉధృతంగా, ఉవ్వెత్తుగా పైకి లేచినట్లుగా ఆ రెండు భావాలు ఒక దానినొకటి ఎదుర్కొని ఆందోళన కలిగించాయి.

"అన్నగారూ–అంతేనా– మీ సిద్ధాంతం కొరకు వదినగార్ని..." అని ఉద్వేగం చేత ఆ పైన మాటలు రాక ఆగాను.

"అదేం కాదు తమ్ముడూ - నువ్వేమీ ఆందోళన పడకు" అన్నా రాయన చిరునవ్వు నవ్వుతూ.

కాకపోవడమేమిటి! అది అంతే. ఆనాడు పరాయివాళ్ళను పార ద్రోలడానికి ఆ ముసలాయన చెప్పిన మాట ప్రకారం సర్వంత్యాగం చేశారు. ఈనాడు తన వాళ్ళను సరిదిద్దడానికి భార్యను బలి చెయ్యడానికి సిద్ధమయ్యారు.

ఇంక ఆయన ముందు నిలబడలేక పోయాను.

నా హృదయంలో రేగిన తుఫానును అరచేత్తో అదిమి పెట్టుకొని తల వంచుకొని ఆయన్ను విడిచి- ఆ సత్రం విడిచి కొన్ని గజాలదూరం చెర చెరా, కొన్ని గజాలదూరం మెల్ల మెల్లగా నడచి - నడవలేక నడచి బయటకు వచ్చేశాను.

గేటు బయటకు వచ్చాక నా హృదయం ఒక్కసారి బావురు మన్నది.

ఎంతో సేపటికి కాస్త తమాయించుకొని- సద్దుకొని "అబ్బే ఈ మనిషితో ఇంతే" అనుకొని అడుగు ముందుకు వేశాను. కాని అగాథం లోకి అడుగు వేసినట్లనిపించింది. ఎంతో బాధపడి పొయ్యాను.

కొన్ని నిముషాల తర్వాత "అన్నగారు చేసిన త్యాగం అంతా వృథా. ఆయనకేమీ లాభం కలుగలేదు. కలుగ చేసుకోలేదు - నేనేం చేస్తాను!" అనుకొంటూ నెమ్మదిగా నా బసకు నడచి వెళ్ళాను.